క్లుప్తంగా

25న జాబ్ మేళా

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని యస్‌కేబీఎస్‌ఎం ఐటీఐ కాలేజీలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ గురువారం తెలిపారు. రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో, డిగ్రీ, పీజీ చదివిన వారు హాజరు కావాలని.. పూర్తి వివరాలకు 8008986256 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రక్తహీనత అధిగమించాలి


మేదరమెట్లలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆరోగ్య సిబ్బంది

మేదరమెట్ల: గర్భిణులు, కౌమారదశ ఆడపిల్లలు, బాలింతలు రక్తహీనతలోపాన్ని అధికమించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు తెలిపారు. మేదరమెట్ల సచివాలయం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను గురువారం పరిశీలించారు. జిల్లా స్టాటిస్టికల్ అధికారి వేణు, సీహెచ్‌వో మల్లికార్జునరావు, డీడీఎం లక్ష్మణ్, ఆరోగ్య విస్తరణాధికారులు బ్రహ్మానందం, జానీ, పీహెచ్‌ఎన్ సుశీల, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమారి, పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

బాలికల చదువు ఇంటికి వెలుగు


బహుమతులు అందిస్తున్న సీడీపీఓ

బల్లికురవ: బాలికలు చదువులో రాణిస్తే ఆ ఇంటికే వెలుగుతో మహారాణులుగా వెలగవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో దాసరి సుధ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కేజీబీవీలో బాలికా విద్యపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. హక్కులకు భంగం కలగకుండా చూసుకోవాలని.. బాలురతో సమానంగా ఉన్నత చదువులతో జీవితంలో స్థిర పడేవరకు వివాహాలు చేసుకోవద్దన్నారు. సూపర్‌వైజర్ విజయనిర్మల, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరెడ్డి, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

ప్రతి మహిళ అక్షరాస్యత సాధించాలి

అద్దంకి రూరల్: ప్రతి మహిళా అక్షరాస్యత సాధించాలని వయోజన విద్య సూపర్‌వైజర్ జె. పోతురాజు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యులైన 650 మంది మహిళలను మొదటి విడతలో గుర్తించామన్నారు. ఎంఈవో 2 సుధాకర్ ఏపీఎం, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

చినగంజాం: మండల సర్వసభ్య సమావేశం 2 శనివారం మండలాధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో పాటు అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు వయోజన విద్యపై అవగాహన

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వయోజన విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎం బండ్ల అనురాధ తెలిపారు. వయోజన విద్య కో ఆర్డినేటర్ పి. పోతురాజు హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామ సంఘాల లీడర్లు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

దగాపడిన పొగాకు రైతు


పొగాకు ఆరబెడుతున్న రైతులు


పంగులూరులో బేళ్లు తొక్కుతున్న రైతులు

- పొగాకు గిట్టుబాటు ధర మాయం
- ప్రారంభంలో క్వింటాకు రూ. 18 వేలు ఇస్తామన్న కంపెనీలు
- దిగుబడి పెరగడంతో రూ. 15550 కు కుదింపు
- కొంటున్నది మాత్రం రూ. 7 వేల నుంచి రూ. 14 వేల వరకే..
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

జె.పంగులూరు: పొగాకు రైతులు తీవ్ర ఆవేదనలో మునిగిపోతున్నారు. భారీగా పెరిగిన సాగు ఖర్చులతో పాటు కంపెనీలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ రైతులను దోచుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించటం లేదు. గత సంవత్సరం రైతులకు ప్రతి పంటలో నష్టాలను చవిచూడగా.. ఒక్క పొగాకు పంట మాత్రమే రైతులు లాభాలు చూశారు. దీంతో ఈ ఏడాది బర్లీ (సిగరెట్) వీఏఎన్-5, వీబీహెచ్-3, రుస్టిక్ (బీడీ) ఏ-119 నాటు పొగాకు రకాలు ఎక్కువగా.. అక్కడక్కడా ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు సాగు చేశారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఇండియన్ టుబాకో కంపెనీ (ఐటీసీ), అలయిన్స్-1 ఇంటర్నేషనల్, వీఎస్‌టీ, గాట్స్ ప్రే ఫిలిప్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు.. రైతులతో పొగాకు సాగు చేయించాయి. అయితే సదరు కంపెనీలు నేడు తక్కువ ధరకు కొనగోలు చేస్తూ రైతుల బతుకులతో చెలగాటమాడుతున్నాయి. పెట్టుబడులు కూడా రాక నష్టాలు చవిచూస్తున్నారు.

సాగు మెండు..

ఈ ఏడాది చాలా మంది రైతుల్లో ఒక్కొక్కరు 10 ఎకరాలకు పైగానే పొగాకు సాగు చేశారు. కొంత మంది 50 ఎకరాల్లో కూడా పంట వేశారు. పంగులూరు మండల పరిధిలో ఎక్కువగా శనగ, మిర్చి పంటలు పండిస్తుంటారు. కానీ ఈ సంవత్సరంలో మిర్చి, శనగ పంటలు సాగు తగ్గి ఎక్కడ చూసినా పొగాకు సాగు పెరిగింది. 2023-24 ఏడాదికి గాను మండల పరిధిలో 1300 ఎకరాలు కాగా ఈ సంవత్సరం 5000 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. గత ఏడాది పొగాకు క్వింటాకు రూ. 20 వేల వరకు ధర రావడంతో ఈ ఏడాది రెట్టింపు సాగు అయ్యింది.

కంపెనీల కొనుగోలు..

పొగాకు కంపెనీలు 2023-24లో క్వింటా పొగాకు నిర్ణయించిన ధర రూ. 15000 గా ఉండగా.. ఈ ఏడాది రూ. 18000 ధర ఉంటుందని కంపెనీలు రైతులను నమ్మించాయి. రైతులకు అవసరమైన సీడ్ కూడా సరఫరా చేశాయి. సాగు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైతుల ఆశలను పొగాకు కంపెనీలు నీరుగార్చాయి. డిసెంబర్ మొదటి వారంలో సమావేశమైన పొగాకు కంపెనీల అసోసియేషన్ ప్రతినిధులు పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ధరను నిర్ణయించడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పండించిన పొగాకు ధరను కంపెనీల అసోసియేషన్ క్వింటాకు రూ. 15,500 మాత్రమే నిర్ణయించింది. గత ఏడాదితో పోలిస్తే క్వింటాపై కేవలం రూ. 500, కిలోపై రూ. 5 మాత్రమే పెంచింది. తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాల పేరుతో ధరను అడ్డంగా కోసేస్తోంది. తూతూ మంత్రంగా నిర్ణయించిన రూ. 15550 ధర ఇస్తున్నట్లు తెలుస్తోంది. పొగాకు బేళ్లలో ఐదు శాతానికి నిర్ణయించిన ధర ఇచ్చి 95 శాతానికి రూ.7000 నుంచి 14000 వరకు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం..

రసాయన ఎరువుల ధరలు పెరగడంతో పాటు ట్రాక్టర్ బాడుగలు, లేబర్ చార్జీలు ఎక్కువ కావడంతో ఎకరాకు రూ. 10 వేల వరకు అదనపు ఖర్చు వస్తోంది. కుటుంబ సభ్యులందరూ రేయింబవళ్లు పొలంలోనే పనులు చేస్తున్నా ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ. 60 వేలు అవుతోంది. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వచ్చింది. ప్రస్తుతం 4 క్వింటాళ్ల వరకు మాత్రమే వస్తోంది. క్వింటాకు నిర్ణయించిన ధర రూ. 15550 ప్రకారం కొనుగోలు చేస్తే ఎకరాకు రూ. 62,200 వస్తుంది. అయితే కంపెనీలు నిర్ణయించిన ధర ఇవ్వడం లేదు. క్వింటాకు రూ.7000 వేలు నుంచి 14000 వరకు మాత్రమే ధర నిర్ణయించడంతో రైతులు కుప్పకూలి పోతున్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న దళారులు

పొగాకు సాగు చేస్తున్న భూములకు కౌలు కూడా భారీగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ. 20 వేలు నుంచి 30 వేలు వరకు కౌలు ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో రూ. 10 వేలు నుంచి రూ. 20 వేల వరకు కౌలు ఉంది. పంట కొనుగోలులో దళారుల హవా నడిపిస్తుండటంతో రైతులకు నిర్ణయించిన ధర లభించడం లేదు. రైతులు తక్కువ ధరకు కొనుగోలు చేసి కంపెనీలకు మాత్రం నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

గిట్టుబాటు ధర లేదయ్యా



నీటి సదుపాయం కింద ఈ సారి 7 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశాం. సొంత భూమి అయితే ఎకరాకు రూ. 70 వేల నుంచి రూ. 80 వేల వరకు పెట్టుబడి వస్తోంది. కౌలుకు తీసుకుంటే పెట్టుబడి వ్యయం రూ. 1 లక్ష ఉంటుంది. ఇంత భారీగా పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక ఈ సారి నష్టాలు తప్పడం లేదు.

– వాలుపల్లి సుబ్బారెడ్డి: కొండమూరు

దిగుబడి తగ్గింది



గత సంవత్సరం 2 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పండించాం. మంచి దిగుబడులు, లాభాలు వచ్చాయి. కంపెనీ వారు మంచి ధర పెట్టి పొగాకు కొనుగోలు చేశారు. కంపెనీలు వచ్చి పొగాకు కొనుగోలు చేయడం లేదు. నల్ల బర్లీ అడిగిన నాథుడే లేదు.

– దాసరి సాల్మన్, కౌలు రైతు

భారత ముద్దుబిడ్డ నేతాజీ


ఈపురుపాలెంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నివాళులర్పిస్తున్న దృశ్యం


బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల టౌన్: మరణం లేని మహోన్నత వ్యక్తి, భారత ముద్దుబిడ్డ మహనీయుడు సుభాష్‌చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో రాణించాలని పలువురు వక్తలు సూచించారు. గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128 జయంతిని పుస్కరించుకుని బోస్ విగ్రహానికి నివాళులర్పించారు. నేతాజీ యూనియన్ ప్రతినిధులు ఎం.గోపాలకృష్ణ, జి.గోపీనాథ్, ఎస్.రామకోటేశ్వరరావు, విశ్రాంత సైనికోద్యోగి గోలి దేవేంద్రనాథం, ఎస్.మణికుమార్, ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడారు. జననం తప్ప మరణం లేని మహావీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం దేశవ్యాప్తంగా ఉన్న యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహోన్నతుల జీవిత చరిత్ర తెలుసుకునిమంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేతాజీ యూనియన్ ప్రతినిధులు ఎస్.మోహనరావు, శ్రీనివాస్, ఈపురుపాలెం పాల్గొన్నారు.

చీరాల రూరల్: చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌వీఎం హైస్కూలు క్రీడా మైదానంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 35 మది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, అమరా వీరాంజనేయులు, వలివేటి మురళీకృష్ణ, చింతా రమేష్, దోగుపర్తి వెంకట సురేష్, పూర్ణా, రమేష్, తిరుపతిరావు, రామబ్రహ్మం, భాస్కరరావు, నాగేశ్వరరావు, కాటమరాజు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పేరాల సెంటర్‌లో గల నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, చుండూరి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, సర్విశెట్టి సుబ్బరామయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.


చీరాల : వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న వాకర్స్ ప్రతినిధులు


పేరాల సెంటర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఇంకొల్లు (చినగంజాం): సుభాష్ చంద్రబోస్ గొప్ప స్వాతంత్ర్య సమర పోరాట యోధుడు అని తహసీల్దార్ వెంకటరత్నం అన్నారు. సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి పురస్కరించుకొని గురువారం ఇంకొల్లు నాగుల చెరువు కట్టపై ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించారు. వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇంకొల్లు: సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం

వేటపాలెం: భారతీయ యువతకు స్ఫూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ప్రధానోపాధ్యాయుడు బలిమి శేఖరరావు పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో 11 సార్లు శిక్ష అనుభవంచి బ్రిటిష్ పాలకులు దిగ్బంధం చేసినప్పటికీ రహస్యంగా తప్పించుకొన్నారన్నారు. సముద్ర మార్గాన రష్యా, జర్మనీ, జపాన్ దేశాలు పర్యటించారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పోటలు నిర్వహించి విజేలతకు బహుమతులు అందజేశారు. ఉమ్మిటి వేణగోపాలరావు, బుద్ధి మోహన్‌రావు, చెరుకూరి రాంబాబు, ఊటుకూరి శ్రీమన్నారాయణ, రొండా దశరథరామిరెడ్డి, కడెం రాముడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేమన పద్య కంఠస్థ పోటీలు


బహుమతులు పొందిన విద్యార్థులు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు -చీరాల ఆధ్వర్యంలో గురువారం వాసవీ క్లాత్ మార్కెట్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో గురువారం వేమన పద్య కంఠస్థ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వలివేటి మురళీకృష్ణ, అధ్యక్షులుగా బత్తుల బ్రహ్మారెడ్డి వ్యవహరించారు. ఆత్మీయ అతిథిగా కోడూరి ఏకాంబరేశ్వరబాబు హాజరయ్యారు. వడలి రాధాకృష్ణ సభా నిర్వహణ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వేమన ప్రజాకవి అని, గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. వేమన పద్యాలను సీపీ బ్రౌన్ వెలుగులోకి తెచ్చారన్నారు. పద్య కంఠస్థ పోటీలకు న్యాయనిర్ణేతలుగా గుత్తి హేరంబరరావు, పి.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. మొదటి బహుమతిని బి.ప్రణవి (విజ్ఞానభారతి హైస్కూల్), ద్వితీయ బహుమతిని వై.సాహితి (భాష్యం హైస్కూల్), తృతీయ బహుమతిని జి.నాగరన్విత (నారాయణ హస్కూల్), కన్సోలేషన్ బహుమతులు ఎం.హర్షిక (భాష్యం హైస్కూల్), కె.తపస్వి (విజ్ఞానభారతి హైస్కూల్, ఆర్.హేమ (కేజీబీవీహెచ్‌ఎస్, బుర్లవారిపాలెం) అందుకున్నారు.

నేడు చర్చావేదిక

చీరాల: పట్టణంలోని ఘంటసాల విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం 5గంటలకు 76 ఏళ్ళ భారత రిపబ్లిక్ నాడు-నేడు-రేపు అనే అంశంపై చర్చావేదికను నిర్వహిస్తున్నట్లు ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఊరూరా జనవిజ్ఞానం, ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక చీరాల పరిసర మండలాల ప్రాంతీయ శాఖ ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల సినీ, దేశభక్తి గీతాల సంగీత విభావరి ఉంటుందని చెప్పారు.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అర్జీల స్వీకరణ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్దీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. గురువారం గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

హామీలు అమలు చేసేవరకు పోరాటం


కొణిదెనలో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: చంద్రబాబు ఎన్నికల హమీలు సుపర్ సిక్స్ హమీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. గురువారం రాత్రి కొణిదెన పంచాయతీలోని గంగపాలెం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. పార్టీ బలోపేతానికి త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎడు నెలలు పూర్తవుతున్నా రైతు వ్యవసాయ పెట్టుబడి, రూ. 20 వేలు ఇవ్వలేదని, పండించిన ధాన్యాన్ని కోనుగోలు చెయ్యటంలేదని వివరించారు. అప్పుల పాలైన కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం అదుకోవడంలేదన్నారు. సూపర్ సిక్స్ హమీలు అమలుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 29 నుంచి పోరుబాట చేపట్టనున్నట్లు కృష్ణబాబు వివరించారు. రెండు గ్రామాల నేతలు గుంజి ఆంజనేయులు, జంధ్రాజుపల్లి ప్రభుదాసు, షేక్ జాన్, కొనిదెన వెంకయ్య, ఆర్‌ఎంపీ భాస్కర్, కొసనం సుబ్బారావు, మొహమాటం రామంజనేయులు, మండలనేని ఆంజనేయులు పాల్గొన్నారు.

సుభాష్ సేవలు శ్లాఘనీయం


అద్దంకి: చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సభ్యులు

అద్దంకి రూరల్: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి వేడుకలు స్థానిక కొత్తపేటలోని సుభాష చంద్రబోస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన్నీరు నాగేశ్వరరావు, సుగుణరావు పాల్గొన్నారు. సంతమాగులూరు గ్రంథాలయంలో లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పశుపోషణలో మెళకువలు అవసరం


వేటపాలెం: గేదెలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

వేటపాలెం: పశుపోషణలో మెళకువలు పాటిస్తే అధిక పాల దిగుబడి సాధ్యమని పశువైద్య సహాయ సంచాయలకులు సజ్జా చిట్టిబాబులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పాపాయిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్తతంగా ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. 40 గేదెలకు చూడి పరీక్షలు, 20 గేదెలు, 25 లేగ దూడలకు సాధారణ పరీక్షలు చేశారు. పశువుల డాక్టర్ ఎస్. దేవలక్ష్మి, బీఎల్డీ ఈఓ చంద్రశేఖర్, పి. రత్నకుమార్, గోపాల మిత్ర కోటి బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: మండలంలోని కల్లంవారిపాలెం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యుడు డాక్టర్ మురళీకృష్ణ పశువులకు వైద్య సేవలు అందించారు. 16 మంది పశుపోషకులకు లబ్ధి చేకూరిందన్నారు.

బల్లికురవ: గ్రామాల వారీగా జరుగుతున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగ పరుచుకోవాలని కొమ్మినేనివారిపాలెం, వైదన సర్పంచ్‌లు యర్రా శాంతమ్మ, మేడా జయలక్ష్మి అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో జరిగిన శిబిరాలను ప్రారంభించారు. వైద్యాధికారులు మహేశ్వరరావు, పావని కుమారి వైద్యసిబ్బంది పాల్గోన్నారు.

రహదారులు అస్తవ్యస్తం


అధ్వానంగా ఉన్న చెన్నుపల్లి-వైదన రహదారి


అద్దంకి మండలంలోని వెంపరాల-మైలవరం రోడ్డు

అద్దంకి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు సంబంధించి నియోజకవర్గంలోని 5 మండలాల్లో సీసీ రహదారులు, సీసీ డ్రైనులు, కల్వర్టుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. యుద్ధ ప్రాతిపదికన రహదారుల నిర్మాణం జరగాని ఆదేశించినా, ఇప్పటికీ చాలా రహదారుల పనులు పూర్తి కాలేదు. నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె. పంగులూరు, కొరిశపాడు, మండలాల్లో మొత్తం రూ.15.80 కోట్లు మంజూరు చేశారు. 105 గ్రామాల్లోని రహదారులకు నిధులు మంజూరు చేయకపోవడంతో వాహదారులకు అవస్థలు తప్పడం లేదు. వేసిన రహదారులు ప్రస్తుతానికి బాగానే ఉన్నా, నాణ్యత లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్వాలిటీ చెక్‌లో లోపాటు బయట పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పూర్తిగా అధ్వానస్థితికి చేరి గోతుల మయమైన పంచాయతీరాజ్ రహదారులున్నా ఆయా రహదారులకు నిధులు కేటాయించలేదు.